క్లుప్తంగా

ఆర్టీసీ బస్సుపై మతి స్థిమితం లేని మహిళ దాడి



మతిస్థిమితం లేని మహిళ దాడితో ధ్వంసమైన బస్సు అద్దాలు

కాజులూరు: రామచంద్రపురం డిపోకు చెందిన కాకినాడ, కోటిపల్లి ఆర్టీసీ బస్సుపై శుక్రవారం గొల్లపాలెం పోలీస్ స్టేషన్ ఎదుట ఒక మతిస్థిమితం లేని మహిళ దాడి చేసి బస్సు అద్దాలు ధ్వంసం చేసింది. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం కాకినాడ నుంచి కోటిపల్లి వెళుతున్న ఆర్టీసీ బస్సు గొల్లపాలెం పోలీస్‌స్టేషన్ ఎదుట బస్టాప్ వద్ద ఆగింది. ప్రయాణికులు దిగుతుండగా మతిస్థిమితం లేని ఒక మహిళ రాళ్లతో బస్సుపై దాడి చేసింది. బస్సు అద్దాలు పగిలి లోపల ఉన్న ప్రయాణికులపై పడటంతో పలువురు గాయాల పాలయ్యారు. స్థానికులు గమనించి మతిస్థిమితం లేని మహిళను అదుపు చేసి తాళ్లతో కట్టి పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. కొద్దిసేపటికి మహిళ తాలూకా బంధువులు వచ్చి బస్సు సిబ్బందితో సంప్రదింపులు జరిపి నష్టపరిహారం చెల్లించి మహిళను తీసుకు వెళ్లిపోయారు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా బస్సు సంఘటనపై లిఖితపూర్వకమైన ఫిర్యాదు లేని కారణంగా ఎటువంటి కేసు నమోదు చేయలేదన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట: తాను చదివిన స్థానిక జవహర్ లాల్ మున్సిపల్ హైస్కూల్లోని విద్యార్థులకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు శుక్రవారం పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ నాల్గోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక తాను చదివిన స్కూల్లోనే తొలి అధికారిక కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చెయ్యడం సంతోషంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రేరణ పోటీలకు ఎంపికైన విద్యార్థిని దుగ్గిరాల శివ నవ్యశ్రీని ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో 17వ వార్డు కౌన్సిలర్ కాళ్ళకూరి స్వరాజ్య భవాని, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టిడ్కో కాలనీ సమస్యలు పరిష్కరించండి



టిడ్కో గృహాల్లో సమస్యలపై దృష్టి సారిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: గొల్లపుంత రోడ్డులో నిర్మించిన టిడ్కో గృహ సముదాయాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అధికారులకు సూచించారు. ఆమె శుక్రవారం టిడ్కో కాలనీని సందర్శించారు. మున్సిపల్ కమిషనర్ బొడ్డేపల్లి రామును వెంట బెట్టుకుని కాలనీలోని వీధుల్లో పర్యటించారు. అపార్ట్‌మెంట్ల మధ్యలో ఉన్న ఖాళీ ప్రదేశంలో పెరిగిన పిచ్చి మొక్కలను, పొదులను పూర్తిగా తొలగించి శుభ్రపరచడంతో చైర్‌పర్సన్ దుర్గారాణి సంతృప్తి వ్యక్తం చేశారు. అపార్ట్‌మెంట్లలో వుండే నివాసితుల సమస్యలు ఏమైనా వుంటే వాటిని వెంటనే పరిష్కరించాలని సూచించారు. తాగునీటి సరఫరా సక్రమంగా జరుగుతుందా లేదా అనే దానిపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో 20వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ మెడింటి సూర్యప్రకాశరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావణ్య, టిడ్కో సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో మలేరియాను తరిమికొడదాం




అవగాహన కల్పిస్తున్న ఎంపీహెచ్ఎస్ కామేశ్వరరావు

కపిలేశ్వరపురం: అవగాహనతో మలేరియాను తరిమి కొడదామంటూ వైద్య ఆరోగ్య శాఖాధికారులు పిలుపునిచ్చారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని వాకతిప్ప, అచ్యుతాపురం పీహెచ్‌సీల ఆధ్వర్యంలో వాకతిప్ప, నల్లూరు, వెదురుమూడి, నేలటూరు గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. వాకతిప్ప పీహెచ్‌సీ ఎంపీహెచ్ఎస్ కామేశ్వరరావు, అచ్యుతాపురం ఎంపీహెచ్ఈఓ గోపాలకృష్ణ మాట్లాడుతూ మలేరియా లక్షణాలను గుర్తించిన వెంటనే వైద్యుడిని సంప్రదించడం ద్వారా వ్యాధి తీవ్రతను తగ్గించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ శ్రీధర్, వైద్య ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన రబీ ధాన్యం కొనుగోళ్లు

- రెండు నియోజకవర్గాల్లో 99,461 ఎకరాల్లో రబీ సాగు
- ప్రైవేట్ కొనుగోలుకు అవకాశం ఇచ్చిన గత ప్రభుత్వం
- రెండు నియోజకవర్గాల్లో 129 ఆర్బీకేలు
- వాటి ద్వారా 54,701 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ



కపిలేశ్వరపురం: 2023-24 రబీ వరిసాగు ప్రక్రియ ముగిసింది. నీటి సరఫరా నుంచి ధాన్యం కొనుగోలు వరకూ గత ప్రభుత్వం సాగు ప్రక్రియను శాస్త్రీయంగా నిర్వహించింది. ధాన్యం కొనుగోలులో గతంలో తలెత్తిన సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు ఆఫ్‌లైన్‌లో సైతం ధాన్యాన్ని విక్రయించుకునే సదుపాయాన్ని రైతులకు ప్రభుత్వం కల్పించింది. ఆసక్తి గల రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వ గిట్టుబాటు ధరకు రైతు భరోసా కేంద్రాల్లో అమ్ముకున్నారు. క్షేత్రస్థాయి పరిస్థితుల్లో అనుకూలత మేరకు రైసుమిల్లర్లకు అధిక ధరలకు సైతం మరి కొందరు రైతులు తమ ధాన్యాన్ని విక్రయించుకున్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో ఈ కథనం...

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో రబీలో 90 శాతం రైతులు ఎంటీయూ 3626 (బొండాలు) రకం వరి వంగడాన్ని సాగు



కపిలేశ్వరపురంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ రాజరాజేశ్వరి

చేశారు. మిగిలిన 10 శాతంలో 1121 (శ్రీధృతి), 34449 ఆరెన్నార్ రకాల వరి వంగడాలను సాగు చేశారు. సరాసరిన ఎకరాకు 55 బస్తాల దిగుబడి దక్కింది. జిల్లాలో 377 ఆర్‌బీకేల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టారు. సాధారణ రకం ధాన్యం 100 కిలోల క్వింటాల్‌కు రూ.2,183, రేటు, 75 కిలోల బస్తాకు రూ.1,637, 40 కిలోల బస్తాకు రూ.873, ఎ గ్రేడు రకం క్వింటాల్‌కు రూ.2,203, 75 కిలోల బస్తా ధర రూ.1,652, 40 కిలోల బస్తా ధర రూ. 881గా చెల్లించారు. 2022-23 సంవత్సరం కన్నా ఈ ఏడాది గిట్టుబాటు ధరను రూ.143కు పెంచారు. గత ప్రభుత్వం ధాన్యం విక్రయించిన 21 రోజుల్లో చెల్లింపులు జరిపేలా ఏర్పాట్లు చేసింది. ఆ మేరకు అనేక మందికి చెల్లింపులు జరిపింది. ఎన్నికల నిర్వహణ తదితర కారణాలతో కొంతమంది రైతులకు నేటికీ చెల్లింపులు ప్రక్రియ కొనసాగుతోంది.

రెండు నియోజకవర్గాల్లో ధాన్యం కొనుగోలు మెట్రిక్ టన్నుల్లో..

మండలం	వరిసాగు (ఎకరాలు)	ఆర్బీకేల సంఖ్య	కొనుగోలు చేసిన ధాన్యం
మండపేట	16,191	24	13,918
రాయవరం	14,641	19	5,115
కపిలేశ్వరపురం	15,762	19	4,645
రామచంద్రపురం	18,128	21	5,472
కె.గంగవరం	15,656	23	9,056
కాజులూరు	19,083	23	16,495
మొత్తం	99,461	129	54,701

స్వేచ్ఛగా విక్రయించుకునే వెసులుబాటు



రబీ పంట తాలూకు ధాన్యాన్ని రైతు తన ఆసక్తి మేరకు విక్రయించుకునే వీలును ప్రభుత్వం కల్పించింది. ఉన్నతాధికారుల ఆదేశాలపై గిట్టుబాటు ధర వివరాలను క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాం. సాంకేతిక సమస్యలు లేకుండా కొనుగోలు ప్రక్రియ సాగింది.

– అశోక్, మండల వ్యవసాయాధికారి, కాజులూరు

ఇసుక అక్రమాలకు తెర

- రాత్రివేళ ఇసుక నిల్వల తరలింపు
- లారీ రూ.12 వేలకు విక్రయాలు
- కపిలేశ్వరపురం ఇసుక ర్యాంపులో అక్రమాలు

కపిలేశ్వరపురం: 'చంద్రబాబు నాయుడు అనే నేను', 'పవన్ కల్యాణ్ అనే నేను' అనే మాటలు వినబడడంతోనే ఈ రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు మటుమాయమైపోతాయని ఆశించిన వారికి అడియాసే ఎదురైంది. కూటమి ప్రభుత్వం వచ్చి రెండు రోజులు గడవకుండానే అక్రమార్కులు ఇసుక ర్యాంపుల్లో అక్రమాలకు తెరలేపారు. వరదల సమయంలో ఇసుక కొరత అధిగమించేందుకు గత ప్రభుత్వ హయాంలో కపిలేశ్వరపురం మండలంలోని తాతపూడి, కపిలేశ్వరపురం ర్యాంపుల వద్ద ఇసుక నిల్వ చేశారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం ప్రభుత్వం మారింది. దీంతో మైన్స్, రెవెన్యూ శాఖల అధికారులు ఆయా ర్యాంపుల్లోని ఇసుక నిల్వలను సందర్శించి నిల్వలను లెక్కించారు. నూతన ప్రభుత్వం ఇసుక విధానాన్ని ప్రకటించాల్సి ఉండడంతో ఇసుక నిల్వలను తరలించే వీలు ఏమాత్రం లేదు. కాగా గురువారం రాత్రి సమయంలో కపిలేశ్వరపురం ర్యాంపు వద్ద నిల్వలను కూటమికి చెందిన నేతల ప్రోద్బలంతో కొందరు అక్రమంగా తరలించారు. పదుల సంఖ్యలో భారీ వాహనాల్లో బిల్లులు కూడా లేకుండానే ఇసుకను అక్రమంగా తరలించారు. లారీ రూ.12 వేల చొప్పున విక్రయిస్తున్నారని స్థానికులు అంటున్నారు. ఇసుక తరలింపునకు అనుమతులు ఎవరిచ్చారన్న తమ ప్రశ్నకు సమాధానం చెప్పక పోవడంతో గురువారం అధికారుల దృష్టికి తీసుకెళ్లామని స్థానికులు తెలిపారు. దీంతో రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకోగా అక్రమార్కులు అక్కడ నుంచి జారుకున్నారు. విషయాన్ని మైన్స్ అధికారులకు తెలియ జేశామని, నిల్వలను పరిరక్షించేందుకు చర్యలు చేపట్టినట్టు ఆర్ఐ శ్రీనివాస్, ఎస్సై అందె పరదేశి, వీఆర్వోలు వీధి ప్రసాద్, జాన్ తెలిపారు.



కపిలేశ్వరపురంలో ఇసుక నిల్వలు

పెద్దమ్మ తల్లికి మొక్కు చెల్లింపు

మండపేట: స్థానిక పెద్దమ్మ తల్లికి శుక్రవారం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ, ఉషశ్రీ దంపతులు మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్రంలోను, దేశంలోనూ ఎన్డీయే కూటమి అధికారంలోకి రావాలన్న తమ అభీష్టం నెరవేరడంతో స్థానిక ఏడిద రోడ్డులోని పెద్దమ్మ తల్లికి 108 కొబ్బరి కాయలు కొట్టారు.

మూడోసారి మండపేట ఎమ్మెల్యేగా ఎన్నికైన వేగుళ్ల జోగేశ్వరరావును పెద్దమ్మ తల్లి గుడికి ఆహ్వానించి, బెల్లంతో తులాభారం వేశారు. అమ్మవారికి నూతన వస్త్రాలు, పసుపు, కుంకుమ, గాజులు సమర్పించారు.

క్యాన్సర్‌ను మొదటి దశలో గుర్తిస్తే పూర్తి చికిత్స

రామచంద్రపురం: క్యాన్సర్‌ను మొదటి దశలో గుర్తించడం ద్వారా పూర్తిగా చికిత్స అందించి ఆరోగ్యంగా ఉంచవచ్చని రాష్ట్ర క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.రమేష్ అన్నారు. స్థానిక ఏరియా హాస్పిటల్‌లో జరుగుతున్న క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి క్యాన్సర్ వ్యాధి గురించి వివరించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో 14,61,427 మంది క్యాన్సర్‌తో బాధపడుతున్నారని తెలిపారు. రామచంద్రపురం టీయు పరిధిలో 110 కేసులు ప్రస్తుతం చికిత్స పొందుతున్నారని తెలిపారు. అనంతరం ఏరియా హాస్పిటల్‌లోని ట్రీట్మెంట్ యూనిట్‌లోని ల్యాబ్‌ను పరిశీలించి కేసుల వివరాలు తెలుసుకున్నారు. జిల్లా అడిషనల్ డీఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ భరతలక్ష్మి మాట్లాడుతూ 30 సంవత్సరాలు దాటి పైన ఉన్న వారందరికీ బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించాలని అనుమానిత కేసులకు క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించాలన్నారు. గ్రామస్థాయిలో క్షయ వ్యాధి నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆర్‌బీఎస్‌కే, ఎన్‌సీడీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఐ.జాన్ లివి, ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ప్రవీణ్, సబ్ డివిజనల్ ఆఫీసర్ ఎన్.ప్రశాంతి, డాక్టర్లు శ్రీధర్, బి.సౌమ్య, డివిజన్ సూపర్‌వైజర్ జి.కమల్ శేషు, ఫిజియోథెరపిస్ట్ మేఘన, మెడికల్ ఆఫీసర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, క్షయ వ్యాధి చికిత్స కేంద్ర సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న రమేష్

రక్తదానం చేద్దాం.. ప్రాణదాతలు అవుదాం

బ్లడ్ డోనర్స్ అధ్యక్షుడు తొగరు మూర్తి

రామచంద్రపురం: రక్తదానం చేసి ప్రతి ఒక్కరూ ప్రాణదాతలు కావాలని బ్లడ్ డోనర్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు తొగరు మూర్తి ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు వెలగల ఫణికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఇరవై మంది రక్తదానం చేసి, యాభై మంది రక్త దాతలు బ్లడ్ గ్రూపులు అందించి అత్యవసర పరిస్థితులలో రక్తదానం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బ్లడ్ డోనర్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు తొగరు మూర్తి రక్తదాతలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జరిగిన సమావేశంలో తొగరు మూర్తి మాట్లాడుతూ వరల్డ్ బ్లడ్ డోనర్స్ డే సందర్భంగా రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తూ రక్తదానానికి ముందు మీరు ఒక సాధారణ మనిషి కావచ్చు కానీ చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న వారి కళ్లల్లో వెలుగులు నింపి.. మీరు విశ్వమంత గొప్పగా కనిపిస్తారన్నారు. నా అనుకునే వారు స్వార్థంతో, భయంతో ఉండిపోతే ఏ రక్త సంబంధం లేని మీవంటి మానవతావాదులు చిరునవ్వుతో రక్తం దానం చేస్తూ రక్తసంబంధం ఏర్పరుచుకుని ప్రాణాలు కాపాడుతున్నారని తెలిపారు. రక్తదానం చేసే దాతకు కులం లేదు మతం లేదు ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేయడమే తన లక్ష్యమని తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేస్తే కేన్సర్ ముప్పు తగ్గుతుందని, సంవత్సరంలో ఒక్కసారైనా రక్తదానం చేస్తే తొంభై శాతం గుండెపోటు ముప్పు తగ్గించుకోవచ్చని తెలిపారు. రక్తంలో అధికంగా ఉండే ఇనుము శాతం వల్ల రక్తనాళాలు పూడికపోయి గుండెపోటు, నొప్పి ఉంటుందని, రక్తదానంతో ఈ ఇనుము నిల్వలు తగ్గి తద్వారా కాలేయం ఆరోగ్యంగా ఉంటుందని డాక్టర్లు తెలియజేస్తున్నారని తెలిపారు. ఒక్కసారి రక్తదానం చేయడం వలన 650 కిలో క్యాలరీలు తగ్గి శరీర బరువు అదుపులోకి వస్తుందని తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల బ్లడ్ డోనార్స్ క్లబ్ అధ్యక్షుడు వెలగల ఫణికృష్ణారెడ్డి ప్రారంభించారు. బ్లడ్ డోనర్స్ క్లబ్ సభ్యులు చంద్రశేఖర్, సత్తిరెడ్డి రవి కుమార్ ఆంధ్ర ప్రకాష్, ఫణికృష్ణారెడ్డి, వెంకటేశ్వరరావు, సాయి, మహేష్, సత్యనారాయణమూర్తి తదితరులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ డాక్టర్ సునీత సిబ్బంది చింతపల్లి వాసు, ప్రభాకర్ శర్మ శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న వారిని అభినందిస్తున్న మూర్తి తదతరులు

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య



విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న ఎంపీపీ నాడు వెంకటరమణ



వెంటూరులో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న జెడ్పీటీసీ మంగతాయారు తదితరులు

రాయవరం: ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతోందని ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. స్థానిక శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం హెచ్ఎం వీఎస్ సునీత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. సమావేశంలో ఎంపీపీ నౌడు వెంకటరమణ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ చిన్నారులను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలన్నారు. నాడు-నేడు పథకం ద్వారా అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటుగా ఉపాధ్యాయుల ఖాళీలను కూడా భర్తీ చేశారన్నారు. విద్యార్థులు ప్రభుత్వం కలిపించిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. సమావేశంలో ఎంఈవోలు పత్తి రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ, స్థానిక నేత వుండవిల్లి రాంబాబు తదితరులు మాట్లాడుతూ విద్యార్థులు విద్యాపరంగా అభివృద్ధి చెందాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు స్టూడెంట్ కిట్లలో భాగంగా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు గంటి రోజా, స్థానిక నేతలు నూలు సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యతోనే సామాజికాభివృద్ధి

విద్యతోనే వ్యక్తిత్వ వికాసం, సామాజికాభివృద్ధి సాధ్యమని జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు పేర్కొన్నారు. మండలంలోని వెంటూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం డి.సత్తిరాజు అధ్యక్షన శుక్రవారం విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు మంగతాయారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే క్వాలిటీ విద్య అందుతోందన్నారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలన్నారు. నాడు-నేడు పథకం ద్వారా అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటుగా ఉపాధ్యాయుల ఖాళీలను కూడా భర్తీ చేశారన్నారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పించిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. సమావేశంలో సర్పంచ్ వాసంశెట్టి వెంకట్రావు తదితరులు మాట్లాడుతూ విద్యార్థులు విద్యాపరంగా అభివృద్ధి చెందాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు స్టూడెంట్ కిట్లలో భాగంగా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

రామచంద్రపురం రూరల్: మండలంలోని తాళ్లపొలం మండల ప్రజాపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో జరుగుతున్న రెండో విడత నాడు-నేడు పనులను సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.మధుసూదనరావు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో నిర్మిస్తున్న రెండు తరగతి గదుల ప్రగతిని స్వయంగా పరిశీలించి వివరాలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థుల హాజరు పరిశీలించి, వారికి పాఠ్యపుస్తకాలు అందినదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. తరగతి గదుల నిర్మాణం వేగవంతం చేయాలని హెచ్ఎంకు సూచించారు. కార్యక్రమంలో సీఎంఓ సుబ్రహ్మణ్యం, ఏఎంఓ పి.రాంబాబు, ఎంఈఓ మానుపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో విక్రయాలను నిషేధించాలి

కాజులూరు: బహిరంగ ప్రదేశాల్లో చేపలు, మాంసం విక్రయాలను నిషేధించాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు. మండలంలోని గొల్లపాలెం, ఆర్యావటం గ్రామాల సరిహద్దులో కోళ్ళతూము సెంటరు వద్ద కల్వర్టుపై కాకినాడ, కోటిపల్లి రహదారిని ఆనుకుని ఇటీవల కొన్నాళ్లుగా వ్యాపారులు చేపలు, మాంసం విక్రయాలు నిర్వహిస్తున్నారు. దీంతో రహదారిపై వాహనాలకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తి ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గొల్లపాలెం, కుయ్యేరు రహదారి పునర్నిర్మాణం పనుల్లో భాగంగా కాజులూరు జంక్షన్ మీదుగా వాహనాల రాకపోకలను అధికారులు నిషేధించారు. దీంతో ప్రయాణికులు ఈ కోళ్ళతూము సెంటర్ నుంచి చీకట్లవారిపేట మీదుగా కాజులూరు, కుయ్యేరు, యానం తదితర ప్రాంతాలకు వెళుతున్నారు. దీంతో ఈ సెంటరులో ట్రాఫిక్ సమస్య జటిలంగా మారింది. గొల్లపాలెం మార్కెట్ సెంటర్‌లో చేపలు, మాంసం విక్రయాలకు ప్రభుత్వం ప్రత్యేక మార్కెట్ షెడ్లను నిర్మించింది. కొందరు వ్యాపారులు ఈ మార్కెట్ షెడ్లలో చేపలు, మాంసం విక్రయాలు చేస్తుండగా కొందరు మాత్రం మార్కెట్ షెడ్లలో వారికి కేటాయించిన ప్లేసును వదిలి ప్రధాన కూడళ్లలో ఇలా రోడ్డుకు ఇరువైపులా వ్యాపారాలు సాగిస్తున్నారు. ఆర్యావటంకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు దేవు సదానందమూర్తి రోడ్లపై బహిరంగ ప్రదేశాల్లో జరుగుతున్న చేపలు, మాంసం విక్రయాలను నిషేధించాలని బాధిత ప్రజల నుంచి సంతకాలు సేకరించి పలుమార్లు సంబంధిత గ్రామ సచివాలయాలకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన విన్నపాలు అధికారులు బుట్టదాఖలు చేయడంతో సమస్య యధాతథంగానే కొనసాగుతుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బహిరంగ ప్రదేశాల్లో చేపలు, మాంసం విక్రయాలను నిషేధించాలని ప్రజలు కోరుతున్నారు.



కోళ్లతూము సెంటర్ వద్ద కల్వర్టుపై చేపలు, మాంసం విక్రయాలు నిర్వహిస్తున్న వ్యాపారులు

తొలగిస్తే పోలా..!



దంగేరు-పేకేరు రహదారిలో ఎండిపోయిన చెట్లు

- ప్రమాదభరితంగా ఎండినచెట్లు
- పట్టించుకోని అధికారులు

కె.గంగవరం: గ్రామీణ ప్రాంతాల్లోని గ్రామాలకు వెళ్లే రహదారిలో రోడ్లకు ఇరువైపులా ఎండిపోయిన చెట్లు ప్రమాదభరితంగా మారాయి. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనూహ్యంగా ఉన్నాయి. గత రెండు నెలలుగా ఎండ తీవ్రతకు రోడ్ల పక్కన చెట్లు ఎండిపోయి పడిపోయే స్థితిలో ఉన్నాయి. ప్రస్తుతం రుతుపవనాల రాక కారణంగా ఎప్పుడు ఈదురుగాలులు, వర్షం పడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అటువంటి సమయంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఎండిన చెట్లు ఈదురుగాలులకు రోడ్డుమీద పడి ఏ ప్రమాదానికి దారితీస్తుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని కె.గంగవరం మండలంలో పామర్రు-కె.గంగవరం, కుడుపూరు-పేకేరు, శివల-యర్రపోతవరం, దంగేరు-కుడుపూరు, కాజులూరు మండలంలోని కుయ్యేరు-కాజులూరు, గొల్లపాలెం-ద్రాక్షారామ, పలు గ్రామాలకు వెళ్లే రహదారులు, రామచంద్రపురం మండలంలో పామర్రు-రామచంద్రపురం, తాడిగొయ్య- వెంకటయ్యపాలెం, హసన్‌బాద-వట్రపూడి వంటి గ్రామాలకు వేళ్ల రహదార్లలో ఎండిపోయిన చెట్లు, తాడిచెట్లు, కొబ్బరి చెట్లు కోకొల్లలుగా ఉన్నాయి. రైతులు, వ్యాపారులు, విద్యార్థులతో ఈ రహదారులు ఎప్పుడు రద్దీగా ఉంటాయి. ద్విచక్రవాహనదారులు, కారులు, కాలినడకన ఎక్కువ వెళ్లే వారుంటారు. ఇటీవల నియోజకవర్గం వ్యాప్తంగా వీచిన భారీ ఈదురు గాలులకు ఎండిన చెట్లు నేలకొరిగాయి. ఆ సమయంలో రోడ్డుపై ఎవరూ వెళ్లకపోవడంతో ఏ ప్రమాదం సంభవించ లేదు. ప్రస్తుతం భారీవర్షాలు, పిడుగులు పడతాయని వాతావరణ శాఖ ప్రజలను హెచ్చరిస్తుంది. ఈ తరుణంలో ఈ ఎండిన చెట్లను తొలగించకపోతే అధికారులు భారీ మూల్యం చెల్లించక తప్పదు. ఇప్పటికైనా ఆయా గ్రామాల పంచాయతీ అధికారులు, ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి ఎండిన చెట్లను తొలగించాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.



ఇటీవల వీచిన ఈదురు గాలులతో రోడ్డుపై పడిన ఎండిన కొబ్బరిచెట్టు (ఫైల్)

చిన్నారుల సంక్షేమ మార్గం అంగన్‌వాడీ కేంద్రం



వెదురుమూడిలో చిన్నారిని అభినందిస్తున్న గజలక్ష్మి తదితరులు



గ్రామంలో ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కపిలేశ్వరపురం: చిన్నారుల సంక్షేమానికి సరైన మార్గం అంగన్‌వాడీ కేంద్రమని ఐసీడీఎస్ కపిలేశ్వరపురం ప్రాజెక్ట్ సీడీపీఓ అధికారి గజలక్ష్మి అన్నారు. మండలంలోని వెదురుమూడిలో శుక్రవారం నిర్వహించిన చిన్నారుల గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గ్రామంలోని 44, 45 అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఐదేళ్లు పూర్తి చేసుకున్న ఎనిమిది మంది చిన్నారులను 1వ తరగతిలో చేర్పించారు. ఈ సందర్భంగా చిన్నారులకు గ్రాడ్యుయేషన్ వేషధారణలో అలంకరించి ప్రోత్సహించారు. అనంతరం 'అంగన్‌వాడీ పిలుస్తుంది' పేరుతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గజలక్ష్మి మాట్లాడుతూ మూడో సంవత్సరంలోకి ప్రవేశించిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని కోరారు. చేరిన చిన్నారులను చూసుకునే విధానంపై అవగాహన కల్పించారు. చిన్నారులను సంరక్షించిన అంగన్‌వాడీ కార్యకర్తలు జానకీదేవి, నాగమణిలను అభినందించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక, శ్రమ స్వచ్ఛంద సంస్థ కో-ఆర్డినేటర్ ఈశ్వరి, మహిళా పోలీసు ప్రమీల పాల్గొన్నారు.